క్లుప్తంగా

అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణకు ఆహ్వానం

వైవీయూ : విజయవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్‌ బి.ఆర్‌. అంబేడ్కర్‌ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముందు నిర్వహించనున్న సమావేశానికి వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు డా. ఎం.ఎం. వినోదినికి ఆహ్వానం లభించింది. ఈమె 17వ తేదీ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే సమావేశంలో ఉపన్యసించనుంది.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్‌

కడప అర్బన్‌ : కడప నగర శివార్లలోని రిమ్స్‌ సీఎస్‌ పరిధిలో చలమారెడ్డిపల్లెకు చెందిన రోహిత్‌ మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ రామచంద్ర తమ సిబ్బందితో కలిసి అరెస్ట్‌ చేశారు. అతని వద్ద నుంచి 8 క్వార్టర్‌ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

షర్మిలతో కాంగ్రెస్‌ పార్టీకి పూర్వ వైభవం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ఆంధ్రప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షురాలుగా వైఎస్‌ షర్మిలా రెడ్డిని నియమించడం సంతోషదాయకమని, ఆమె నాయకత్వంలో కాంగ్రెస్‌ పార్టీకి పూర్వవైభవం వస్తుందని కాంగ్రెస్‌ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పటాన్‌ మహమ్మద్‌ అలీఖాన్‌ ఓ ప్రకటనలో తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్సార్‌ తనయగా ఆమెకు కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్రస్థాయిలో పార్టీ అధ్యక్ష పదవిని ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

చెస్‌లో క్రీడాకారుల ప్రతిభ

కడప స్పోర్ట్స్‌ : బెంగళూరు రూరల్‌ డిస్ట్రిక్ట్‌ చెస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ బీఆర్‌డీసీఏ చెస్‌ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు బహుమతులు సాధించారు. ఈనెల 11వ తేదీన నిర్వహించిన ఆన్‌లైన్‌ ఓపన్‌ చెస్‌ పోటీల్లో 50 ప్లస్‌ విభాగంలో అనీస్‌ దర్బారీ 6 పాయింట్లతో రెండోస్థానం, అండర్‌–15 బాలికల విభాగంలో లాస్యశ్రీ మూడో స్థానంలో నిలిచారు. వీరితో పాటు అండర్‌–11 బాలికల విభాగంలో లక్ష్మీమనుశ్రీ మూడోస్థానం, అండర్‌–9 బాలికల విభాగంలో అమీనా 5వ స్థానంలో నిలిచినట్లు జిల్లా చెస్‌ అసోసియేషన్‌ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు.

నేషనల్‌ యూత్‌ ఫెస్టివల్‌లో వైవీయూ వలంటీర్లు



నేషనల్‌ యూత్‌ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు

వైవీయూ : మహారాష్ట్రలోని నాసిక్‌ నగరంలో నిర్వహించిన 27వ నేషనల్‌ యూత్‌ ఫెస్టివల్‌లో వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు పాల్గొని ప్రదర్శన నిర్వహించారు. 'మై భారత్‌–2047– బై ది యూత్‌ ఫార్‌ ద యూత్‌' అన్న అంశంపై నిర్వహించిన ఈ యువ ఉత్సవాల్లో వైవీయూ నుంచి ప్రాతినిథ్యం వహించిన కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్ల బృందం కత్తిసాము ప్రదర్శన నిర్వహించి ప్రశంసాపత్రం పొందారు.

క్యాలెండర్‌ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్‌ : మోస్ట్‌ బ్యాక్‌ వర్డ్‌ క్లాస్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆవిష్కరించారు. సోమవారం తమ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంబీసీ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ రూపొందించడం అభినందనీయమన్నారు. ఎంబీసీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌. బాదుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. పెద్దన్న, లీగల్‌ అడ్వైయిజర్‌ రామస్వామి, ప్రచార కార్యదర్శి కుల్లాయప్ప, సెక్రటరీ మల్లీ యాదవ్‌, ఖలీల్‌బాషా, మహబూబ్‌ బాషా, శివయ్య, ఆర్‌. బాబు పాల్గొన్నారు.

కమనీయం శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం

వేంపల్లె : స్థానిక వృషభాచలేశ్వరస్వామి ఆలయ అనుసంధానంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కుర్రాకుల వెంకటేసు, ఓబులమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు చిన్నస్వామి, హరిప్రవీణ్‌, నేతృత్వంలో పురోహితులు శాస్త్రోయుక్తంగా వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వైభవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీధర్‌, ఆలయ చైర్మెన్‌ వెంకటేష్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ రంగప్రసాద్‌, లక్ష్మిరెడ్డి, పాలకమండలి సభ్యులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గండి అంజన్న గ్రామోత్సం

చక్రాయపేట : మకర సంక్రాంతి పర్వదినం పురష్కరించుకుని సోమవారం సాయం త్రం గండి వీరాంజనేయస్వామి గ్రామోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రత్యేక పుష్పాలంకరణతో ఉన్న రథంలో ఉన్న ఉష్ట్ర వాహణంపై అంజన్న ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగింపు చేశారు. ఆలయ సహాయ కమిషనర్‌ అలవలపాటి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు రాజారమేష్‌, రాజ గోపాలాచార్యులు, గ్రామోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణతో పాటు ఉదయం నుంచి వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగ కార్యక్రమాలను నిర్వహించారు.

వైభవంగా కనుమ సంబరాలు



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాకా సురేష్‌ కుమార్‌ తదితరులు



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కార్పొరేషన్‌ : సంక్రాంతి పండుగలో భాగంగా మూడో రోజైన కనుమ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక 47వ డివిజన్‌లో ఏపీ పాల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు సభ్యులు పాకా సురేష్‌ కుమార్‌ ఆధ్వర్యంలో ఒంటెద్దు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆలంఖాన్‌పల్లెకు చెందిన శివ ప్రథమ బహుమతి, షేక్‌ రెడ్డి బాషా రెండో బహుమతి, కె. హనుమంతు మూడో బహుమతి గెలుచుకున్నారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జ్ఞాన సాయి ప్రథమ, పద్మ ప్రియ ద్వితీయ, ఉమామహేశ్వరి తృతీయ బహుమతులు సాధించారు.

- సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక పాతకడపలో ఇసుకపల్లి చైతన్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎం. సీతారామయ్య, ఆర్‌. అనిల్‌ కుమార్‌, గిరి కుమార్‌, నిత్య, సంపత్‌ కుమార్‌, సునీల్‌, మనోజ్‌ పాల్గొన్నారు.
- మాసాపేటలో జై భీమ్‌ దళిత సేన అధ్యక్షుడు పి. సంపత్‌ కుమార్‌, చైతల్య ఆధ్వర్యంలో కబడ్డీ, క్రికెట్‌, రన్నింగ్‌ వంటి క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

కడప కల్చరల్‌ : కడప శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు చిన్నారులకు సంప్రదాయ దుస్తుల పోటీ నిర్వహించారు. 3–9 సంవత్సరాల మధ్యగల చిన్నారులు ఈ సందర్భంగా సంప్రదాయ వస్త్రధారణతో అందరినీ ఆకట్టుకున్నారు. 26 మంది చిన్నారులు పాల్గొన్న ఈ పోటీ అలరించింది. విజేతలైన విద్యార్థులకు నగదును బహుమతిగా అందజేశారు. అలీ, సుమలత న్యాయ నిర్ణేతలుగా వ్యవహారించారు. అనంతరం సంప్రదాయ నృత్యాలతో కళాకారులు సందర్శకులను ఉర్రూతలూగించారు.

సంస్కృతి సంప్రదాయాలను రక్షిద్దాం



కవితాగానం చేస్తున్న బాల ఎల్లారెడ్డి

కడప కల్చరల్‌ : నానాటికి కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత పౌరులందరిపైన ఉందని ఇంటాక్‌ జిల్లా చాప్టర్‌ కన్వీనర్‌ లయన్‌ కె.చిన్నపరెడ్డి అన్నారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్‌ కల్చరల్‌ సొసైటీ, పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ, సరస్వతమ్మ ఛారిటబుల్‌ ట్రస్టు ఉమ్మడి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా స్థానిక గ్రాండ్‌ ఇన్‌ సమావేశ మందిరంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన చిన్నపరెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి అన్నం పెట్టే రైతు క్షేమంగా ఉన్నప్పుడే సమాజంలో ఎలాంటి అలజడులు ఉండవన్నారు. లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మనుషుల మధ్య కుల, మత, ఆర్థిక అసమానతలు పెరుగుతుండడం సమాజానికి మంచిది కాదన్నారు. రాయలసీమ సంస్థ ప్యాట్రన్‌ పద్మప్రియ చంద్రారెడ్డి, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, అధికారభాష సంఘం సభ్యులు డాక్టర్‌ తవ్వా వెంకటయ్య, ఎన్‌ఆర్‌ఐ ఈశ్వర్‌కుమార్‌ మాట్లాడుతూ సమాజానికి పనికి వచ్చే కవిత్వం రావాలని ఆకాంక్షించారు. రాయలసీమ సంస్థ అధ్యక్షులు కొండూరు జనార్దన్‌రాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం డాక్టర్‌ జీవీ సాయిప్రసాద్‌ ఆధ్వర్యంలో దాదాపు 12 మంది కవులు సంక్రాంతి గురించి కవితాగానం చేశారు. వెల్లాల వెంకటేశ్వరాచారి, మధుబాబు పద్యాలాపన చేశారు. నిర్వాహకులు కవులు, అతిథులను ఘనంగా సత్కరించారు.

డ్రైవర్లు అప్రమత్తతతో వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి వాహనాలు నడపాలని ఆర్టీసీ రీజినల్‌ మేనేజర్‌ పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆర్టీసీ గ్యారేజీలో జాతీయ భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, ట్రాఫిక్‌ సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రీజియన్‌ను ప్రమాదాలు లేని రీజియన్‌గా తీసుకురావాలన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాగే మద్యం సేవించి విధులకు హాజరు కారాదని సూచించారు. రోడ్డు పక్కనగల సిగ్నల్స్‌ అనుసరించి విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి యేటా భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని, డ్రైవర్లు తమ విధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 14వ తేదీ వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం, సుఖమయం, శుభప్రదమని ప్రయాణికులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌ డిల్లీశ్వరరావు, అసిస్టెంట్‌ మేనేజర్‌ కన్యాకుమారి, ఎస్‌టీఐ మంజుల, ట్రాఫిక్‌ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌కు సన్మానం



ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న సీహెచ్‌ వినోద్‌ కుమార్‌ తదితరులు

కడప కార్పొరేషన్‌ : రాష్ట్ర ఎస్సీ కమిషనర్‌ చైర్మన్‌ మారుమూడి విక్టర్‌ ప్రసాద్‌కు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ వినోద్‌ కుమార్‌ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన్ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని స్వరాజ్‌ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణకు దళిత సోదరులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె. బాబు, శ్యాంసన్‌, జ్యోతి, బండి రమణ, పి. శివ, సీహెచ్‌ సునీల్‌, లక్ష్మినారాయణ, శరత్‌ బాబు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌కు సత్కారం :

జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ చైర్మన్‌ విక్టర్‌ ప్రసాద్‌కు బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజయ్‌కుమార్‌, రమేష్‌ బాబు, కిరణ్‌, సుధీర్‌, సునీల్‌ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి ఎంపీ సహకారం



నగదును అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : కూనవారిపల్లె హరిజనవాడలో నూతంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఖాజీపేట మండలం కూనవారిపల్లె పంచాయతీలోని హరిజనవాడలో నూతనంగా చర్చి నిర్మిస్తున్నారు. చర్చి నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయాన్ని అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్‌ సుబ్బారెడ్డిలు ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చర్చి నిర్మాణానికి రూ.2 లక్షలను ప్రకటించారు. మంగళవారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతులమీదుగా నగదును చర్చి నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న సీఎం జగన్‌ చేతుల మీదుగా అంబేడ్కర్‌ విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు. అందుకు బస్సును ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. విగ్రహ ఆవిష్కరణలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్‌ గంగాధర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్‌ భూమన సుబ్బారెడ్డితోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు బి.మఠంకు ఎమ్మెల్యే, డీసీసీ బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ రాక

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన సహకార పరపతి సంఘం భవన ప్రాంభోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే ఎస్‌. రఘురామిరెడ్డి, డీసీసీ బ్యాంక్‌ చైర్‌పర్సన్‌ మల్లెల ఝాన్సీలు వస్తున్నట్లు సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, పరపతి సంఘం సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రావాలని కోరారు.

గ్రామీణ మేళాలో 'దేవి'కి బహుమతి



దేవికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఓబులదాస్‌

కడప కల్చరల్‌ : నాబార్డు నిర్వహించిన సంక్రాంతి గ్రామీణ ఉత్పత్తుల మేళాలో చిన్నమండెం మండలం మల్లూరుకు చెందిన దేవి స్టాల్‌కు ఉత్తమ బహుమతి లభించింది. నిర్వాహకులు, దాస్‌ ఎడ్యుకేషనల్‌ అండ్‌ వెల్ఫేర్‌ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఓబుళదాస్‌ ఆమెకు ఈ మేరకు నాబార్డు పక్షాన ప్రశంసాపత్రం అందజేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వారం రోజులపాటు నిర్వహించిన గ్రామీణ ఉత్పత్తుల మేళాలో దేవి తమ స్టాల్‌లో కొయ్యతో చేసిన ఆకర్శణీయమైన వస్తువులతో పాటు ఇంటిలో ఉపయోగించే వివిధ సామగ్రిని ప్రదర్శించారు. వీటికి విశేష ఆదరణ లభించడంతో అమ్మకాలను మరోరోజు పొడిగించారు. నిర్వాహకులు ఓబులదాస్‌ అత్యుత్తమ వ్యాపారం చేసినందుకు దేవి స్టాల్‌కు ఈ బహుమతి అందజేసి ప్రశంసించారు. తనకుఈ అవకాశం కల్పించడంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు స్టాల్‌ ఏర్పాటు ద్వారా ప్రోత్సాహం అందించినందుకు దేవి నాబార్డుతోపాటు నిర్వాహకులు దాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మేలుకో బీసీ చర్చా వేదిక



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు మేలుకో బీసీ ప్రజాతంత్ర చర్చా వేదిక నిర్వహిచనున్నట్లు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ చెన్నా సరళాదేవి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మేలుకో బీసీ కార్యక్రమానికి సంబధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభాలో అధిక శాతం బీసీలు ఉన్నా రాజ్యాధికారం సంపాదించుకోలేక పోతున్నామన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప సంక్షేమానికి కృషిచేయడం లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికల్లో బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను కేటాయించాలని డిమాండ్‌ చేశారు. మేలుకో బీసీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఆర్‌.రమేష్‌ యాదవ్‌, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్‌ బచ్చల పుల్లయ్య, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్‌ సోమా లక్ష్మినరసయ్య, బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు తదితరులు పాల్గొంటారన్నారు. అన్ని బీసీ కులాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని తమ సూచనలు, సలహాలను ఇవ్వాలని కోరారు. బీసీ నాయకులు పాణ్యం సుబ్బరాయుడు, సందు శివనారాయణ, శ్రీనివాసాచారి, కృష్ణయ్యయాదవ్‌, రామకృష్ణ, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గమల్లేశ్వరుని ఫొటోల ఆవిష్కరణ



ఫొటోలను ఆవిష్కరిస్తున్న స్వామిజీ

కడప కల్చరల్‌ : కడప నగర సమీపంలోని బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయ మూల విరాట్‌ ఫొటోలను మంగళవారం శ్రీరామకృష్ణ మిషన్‌ ప్రతినిధి స్వామి సన్నివాశానంద ఆవిష్కరించారు. స్థానిక చెన్నూరు బస్టాండులోని రామకృష్ణమఠం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పాత్రికేయులు జ్యోతి జార్జి రూపొందించిన ఈ ఫొటోలను పరిశీలించిన ఆయన జిల్లా ఆధ్యాత్మిక చరిత్రకు ఆలవాలంగా నిలిచిన దేవాలయాల గురించి సమాచారాన్ని భావి తరాలకు అందించేందుకు చేస్తున్న ప్రయత్నం ప్రశంసనీయమన్నారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని మరిన్ని ఆలయాలకు సంబంధించిన చరిత్రను రికార్డు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పర్యాటకరంగ అభివృద్ధి సంస్థ కార్యదర్శి డాక్టర్‌ ఎ.రామాంజులరెడ్డి, సాహితీవేత్త వెల్లాల వెంకటేశ్వరాచారి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం



వైద్యవిద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న బండారు సూర్యనారాయణ

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో శ్రీ చౌడేశ్వరిదేవి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎంబీబీఎస్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.శ్రీలీనా అనే వైద్య విద్యార్థినికి హాస్టల్‌ ఫీజుకు గాను రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ అందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఉన్న పేద తొగటవిద్యార్థులకు సంఘం తరఫున చేయూత అందిస్తామని తెలిపారు. లీనా బాగా చదువుకుని పేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి శెట్టి చౌడయ్య, మోతుకూరు సుబ్బయ్య, రామయ్య, ఉపాధ్యాయులు తులసీ ఈశ్వరయ్య, సుబ్బయ్య, గాలి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కవితతో పూర్వపు విద్యార్థులు

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్‌ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం పాఠశాల పూర్వపు విద్యార్థులు నాడు–నేడు ఫేజ్‌–1 పనులు పూర్తయిన సందర్భంగా సందర్శించి హర్షం వ్యక్తం చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.జె.పి.కవిత తెలిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ మేము చదువుకునే రోజుల్లో ఇలాంటి మౌలిక వసతులు లేవని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం హర్షణీయమని, ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక మరుగుదొడ్లు, ట్యాబ్‌లు, రక్తహీనతకు ఐరన్‌ ట్యాబెట్లు, జగనన్న గోరుముద్దలో గుడ్లు, రాగిజావ, చిక్కీ వంటి విద్యార్థులకు అందిస్తున్నారని, అలాగే జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, బూట్లు అందజేస్తున్నారని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సురభి నాటకాలకు విశేష స్పందన



వైజాగ్‌ కలెక్టర్‌ దంపతులను సత్కరిస్తున్న వైఎస్‌ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల : సంక్రాతి సందర్భంగా స్థానిక గరండాల రివర్‌ ఫ్రంట్‌(రాణితోపు)లో నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా సోమవారం మూడోరోజు వైజాగ్‌ కలెక్టర్‌ డాక్టర్‌ మల్లికార్జున దంపతులు ఈ నాటకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పులివెందుల మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, కమిషనర్‌ నరసింహారెడ్డిలు కలెక్టర్‌కు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం వారు పాతాళ భైరవి నాటకోత్సవాన్ని కాసేపు తిలకించారు. సురభి నాటకోత్సవాలను తిలకించేందుకు ఆ ప్రాంతం నిండుగా ప్రజలతో కనువిందుచేసింది.

డిప్యూటీ సీఎం కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు స్వీటు తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్‌ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్‌ నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంకు కండువా కప్పి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ హిందువుల పండుగల్లో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానముందని, మూడు రోజుల పాటు నిర్వహించే అతిపెద్ద పండుగు ఇదేనన్నారు. సుఖ సంతోషాల మధ్య పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ ఎస్‌ఎండీ షఫీ, అహ్మద్‌, మురళీ, గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.

ఉల్లాసంగా పారువేట ఉత్సవం

కమలాపురం : కమలాపురం–ఖాజీపేట ప్రధాన రహదారిలో పట్టణ శివారులోని పాగేరు వంక వద్ద కనుమ పండుగ పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన పారువేట ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పురుషులకు కబడ్డీ, బండ లాగుడు పోటీలు, రన్నింగ్‌ రేస్‌, మహిళలకు ముగ్గుల పోటీలు, లెమన్‌ స్పూన్‌ తదితర పోటీలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయం నుంచి పాగేరు వంక వరకు శివ పార్వతులను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అలాగే కంచి వరదరాజ స్వామి వారిని ఆలయం నుంచి పాగేరు వంక వరకు ఊరేగింపుగా స్వామి వారిని తీసుకువచ్చారు.

పెండ్లిమర్రి : మండలంలోని ప్రజలు మకర, కనుమ పండుగలను చిన్నా, పెద్దా తేడా లేకుండా వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముంగింట ముగ్గులు వేశారు. చిన్న పిల్లలు గాలి పటాలు, కబడ్డీ, ఖోఖో, వాలిబాల్‌, పాటలకచేరివంటి ఆటలతో అడుకుంటు కెరింతలు కొట్టారు. పండుగ సందర్భంగా బంధువులతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. వెయ్యినూతలకోన క్షేత్రంలో మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆలయ ధర్మ కర్త నరసింహ హరిప్రసాద్‌ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. పెండ్లిమర్రి అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శనం కల్పించారు.

గాలి పటాలతో నిరసన

కడప సెవెన్‌రోడ్స్‌ : అంగన్వాడీ వర్కర్లు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌ వద్ద గాలిపటాలు ఎగురవేయడం ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు. సమ్మె 36 రోజులైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్‌, అంగన్వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి అన్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీల నగర అధ్యక్ష, కార్యదర్శులు వినీల, అంజనీదేవి, నాయకులు సావిత్రి, పోలమ్మ, సుబ్బమ్మ, లక్ష్మీదేవి, మెర్సి, ఉదయ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు నేక్‌నామ్‌ఖాన్‌ కళాక్షేత్రంలో జలిజ సంఘాల సమావేశం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

కడప కల్చరల్‌ : శ్రీకృష్ణ దేవరాయల జయంతి సందర్భంగా జిల్లాలో బలిజ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని నేక్‌నామ్‌ఖాన్‌ కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. కొన్ని బలిజ సంఘాలు తమ కార్యాలయాల్లో రాయల జయంతి సందర్భంగా విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఊరేగింపుగా కళాక్షేత్రానికి చేరుకోనున్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారు.

అల్ట్రా క్రికెట్‌ టీమ్‌కు ట్రోఫీ అదజేత

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బక్కన్నగారి పల్లె గ్రామంలో నిర్వహించిన కృష్ణా నాయక్‌ మెమోరియల్‌ మెగా క్రికెట్‌ టోర్నమెంట్‌ విజేతగా అల్ట్రా క్రికెట్‌ టీమ్‌ నిలిచింది. విజేతకు వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తనయుడు, యువ నాయకుడు సాయిభైరవ్‌ ప్రీతమ్‌ రెడ్డి, సర్పంచ్‌ మల్లయ్యలు ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువతను ఉత్సాహపరుస్తూ పెద్ద ఎత్తున క్రికెట్‌ టోర్నమెంటును నిర్వహించడం సంతోషదాయకమన్నారు. టోర్నమెంటు నిర్వాహకులను అభినందించారు. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన బాలాజీ నాయక్‌, మ్యాన్‌ ఆఫ్‌ ది సిరీస్‌గా నిలిచిన ప్రభాకర్‌ నాయక్‌ కు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పద్మనాభ రెడ్డి, ఎంపీటీసీ వరాలమ్మ, మాజీ సర్పంచులు నాగసుబ్బయ్య, బయన్న, ఫిజికల్‌ డైరెక్టర్‌ రాజాతోపాటు టోర్నమెంట్‌ విజేతగా నిలిచిన అల్ట్రా టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీ అమ్మవారి చీరలకు వేలం పాట

ఎర్రగుంట్ల : పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి చీరెల వేలంపాటను సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు అందించిన చీరెలను ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా వేలం వేస్తుంటారు. పట్టు చీరెలు సహితం అమ్మవారి పాటను రూ.100 నిర్ణయించి అక్కడ నుంచి వేలం పాటను కొనసాగించారు. ఇలా చీరెల వేలం పాటలో వచ్చిన మొత్తంను ఆలయం అభివృద్ధి పనులు చేపడుతున్నారు.